


# శ్రీ విశ్వనాథ కవిరాజు

(రాత్రి 9 గంటలవేళ. మీనాక్షీ పున్నయ్యా పడక గదిలో. గది ద్వారం వీధివైపు. వీధి నేపథ్యము దెస. వీధి నిండా పిండారబోసినట్లు వెన్నెల. ఆమె యీజీచైరులో కూర్చుండి 'భారతి' చదువుతూ; అతడు కొయ్య కుర్చీపై కూర్చుండి 'గృహలక్ష్మి' చూస్తూ)

మీనా:—(గట్టిగా) ఉమ్మిడి రామయ్యశెట్టి గురుస్వామిశెట్టి & కంపెని, నగలవ్యాపారులు, 25, చైనా బజారు రోడ్డు, మదరాసు.

పున్న:—(ఆవేశంతో) పోతే పంవత్సరం చందా పోయింది గాని ఇంక 'భాగతి' నా గుమ్మంలోకి పంపవద్దని రేపే జాబువ్రాసి వేస్తాను.

మీనా:—ఆ గృహలక్ష్మిలో కూడా వున్నది చూడండి.

పున్న:—ఇంక పత్రిక అన్న కాగితాన్ని ఇంటికి రానివ్వను. ఈలాగు నగలూ నాణ్యాలూ ప్రకటిస్తూ వున్నందువల్ల కుటుంబం నడిపే సంసారులకు ఎంత ఇబ్బందిగా వుందో తెలియకండా వుందీ పత్రికలవాళ్లకి.

మీనా:—కొని పెట్టే వాళ్లకు ఇబ్బంది గాని కొంటాను కొంటానని ఆశ పెట్టేవాళ్లకు ఇబ్బందేమిటి?

పున్న:—ఆశ పెడితే మాత్రం? ఒకనాడు గాకుంటే యింకొకనాడయినా కొని తీరవలిసిందే గదా?

మీనా:—ఆ బాధ్యత కొందరికే గాని అందరికీ వుంటుందనుకోను. 'నీకు కాసులు దండ చేయిస్తాన'ని నేను పుట్టిందగ్గర్నుంచి అంటున్నారు.

పున్న:—అది అబద్ధం. నువ్వు పుట్టిన పధ్నాలుగేళ్లదాకా నీ మొహం నేనెరగను. పుట్టిన గుంటపాపలందరికీ కాసులదండలు చేయించడమే నాకు పనను కున్నావా యేం?

మీనా:—అయితే మీరనలేదూ?

పున్న:—అన్నాను నీ బాధ పడలేక.

మీనా:—నా బాధపడలేకా?

పున్న:—ఆ - మున్మాటికీ. భగవంతుడు సాక్షిగా పెళ్లాల బాధవల్ల గాకుంటే యెంత తెలివితక్కువవాడయినా తనకుతానై నగలు చేయిస్తాడనుకోకు.

మీనా:—సరే నీతిగలమనిషి ఆడిన మాట నిలబెట్టుకో వద్దూ?

పున్న:—వాళ్లకిష్టముంటే వాళ్లు నిలబెట్టుకుంటారు. నువ్వు చెప్పేదేమిటి?

మీనా:—నీతి గల వాళ్లమాట పోనీయండి - మరి మీ సంగతి?

పున్న:—నీ సంగతి ననుసరించి వుంటుంది. చేయించే దురదృష్టం నాకూ పెట్టుకొనే అదృష్టం నీకూ కలిసి వస్తే ఆ తరవాత ఒక క్షణం పట్టదు. నింపాదించవలె.

మీనా:—ఇంకా ఎంత కాలం?

పున్న:—నేను సంపాదించేవరకూ.

మీనా:—ఏమిటీ! మీరే! డబ్బే! సంపాదించడమే! కాసులు దండ చేయించడానికే! ఓయబ్బా యెలా సంపాదించేస్తారు చెప్మా!!

పున్న:—ఏమిటే ఏమిటే అంత ఆశ్చర్యం – తెలీకడుగుతాను? ఇప్పుడు చదువు కొన్న వాళ్ల కుద్యోగా లివ్వకుండా వున్నారు తెలుసునా?

మీనా:—అయితే?

పున్న:—ఇంక చదువు లేని వాళ్లకే వుద్యోగాలన్న మాట - తెలిసిందా?

మీనా:—ఆ వైపు నుంచే వుద్యోగాలు వస్తే మీకే కలక్టరీవో గాక తప్పదు. అప్పుడు చంద్రహారాలు చేయిస్తురు గాని, ఇప్పుడు కాసులదండ చేయించడానికే మధ్యంతరం చెప్పండి. భూముల మీద నుంచి శిస్తులు 800 మొన్ననే గదా వచ్చాయి..

పున్న:—లెక్కపెట్టేవా యేమిటి? బావుంది. ఐనా దగుల్బాజీలతో వ్యవహార్మం చేయ రాదు.

మీనా:—అదేమిటండోయ్ అది?

పున్న:—అబ్బ! నిన్ను కాదు వినే. మొన్న నీకు పోచీలు చేయించే టప్పుడు ఎలాటి పేచీలొచ్చాయో తెల్సునా? కొనేటప్పుడు వర్తకుడు ముప్పావు తులం బంగారం తగ్గించాడు. చేయించే టప్పుడు విశ్వబ్రాహ్మణుడు వస్తువులో తులన్నర రాగి కలిపేశాడు. అప్పుడు రామాయణం పట్టుకుని ప్రమాణం చేశాను రహస్యంగా— వర్తకుడి దగ్గిర బంగారం కొననని కగుంసాలి చేత వస్తువులు చేయించ ననీ.

మీనా:—పోనీ పి. ఆర్. అండ్ సన్సు నుంచి తెప్పిస్తారా?

పున్న:—నోసన్స్! నాన్సెన్స్!

మీనా:—అబ్బో! అప్పుడే వుద్యోగం ప్రారంభమైందే!

పున్న:—వైఫ్! డబ్బు దగ్గిర సన్ యేమిటి ఫాదరేమిటి? ఈ సన్సువాళ్లు మాత్రం వర్తకులు గారా? వీళ్లు పెద్దవర్తకులు. చిన్నవర్తకులు టోపీ పెడితే పెద్దవర్తకులు శుద్ధ క్షవరమే చేస్తారు.

మీనా:—అయితే సోమయ్య పంతులుగారు కొడుకు చదువు కోసం భార్య కాసులదండ అమ్మేస్తున్నారు. అది కొనండి.

పున్న:—మీనం! నువ్వు 'యంగ్ వుమన్' వి. నీకు తెలీదు. అమ్మే వస్తువు యెన్నడూ కొన కూడదు. అది చేయించిన వేళ విషపు ఘడియలు గనుకనే దాన్ని అమ్మకో వలసి వస్తుంది. అది కొని మనమేం బాగు పడతాం?

మీనా:—బాగు బాగు. మీ మాటల్ని బట్టి చూస్తే ఇంక ఒక చిన్న మెత్తు బంగారమయినా నా వొంటి మీద కెక్కే మార్గం లేదన్న మాట. మా వాళ్లు పసుపూ, కుంకం కొరకు ఇచ్చిన భూమి మీద నుంచి ఏటేటా వచ్చే 150 రూపాయలూ?

పున్న:—(మీదకు చూపి) వాడికి తెలుసును, కోమటి గున్నయ్యకి తెలుసును. పసుపు కోసం యిచ్చింది పౌడర్ డబ్బాలకీ, కుంకం కోసం యిచ్చింది సోప్ కేకులకీ సరి పోతూ వుంది. ఇంక సెంట్సూ హెయిరోయిల్సూ రిబ్బన్సూ, సిల్కుచీరల్సూ, జంపర్ జాకెట్సూ వీటికి నా రాబడి సరిపడకుండా వుంది. నువ్వు తెలివయిందానివి. ఫస్టుఫారం ఫెయిలైనావు. కావలిస్తే ఖర్చు వెచ్చా లొక సంవత్సరం ఎక్కచ్చీగా నడిపించిచూడు.

మీనా:—నన్ను పెండ్లాడినందుకు నా ఖర్చువెచ్చాలు భరించే పూచీ మీకు రావలసిన 1800 వడ్డీతో సహా 4500 అక్కడ పెట్టండి. ఇదో ఆట లాగుంది.

పున్న:—ఇది కరిరాజవరదుండగు ఆ భగవంతుడు తీర్చవలసిన అప్పు. ఒకానొకప్పుడు రామదాసు అప్పు తీర్చలేదూ? మనుష్యమాత్రుణ్ణి, అర్భకుణ్ణి నే తీర్చ దేమిటి?

మీనా:—ఈ పొల్లుమాటల్తో తీరి పోదండోయ్.

పున్న:—కాకుంటే? 'న స్త్రీ వడ్డీవ్యాపారమర్హతి' ఆడదంటేనే లోకానికి వెర్రి, అందులో డబ్బున్న ఆడదంటే—

మీనా:—వీల్లేదు. చూడండి. ఉమ్మిడి రామయ్య శెట్టి గురుస్వామిశెట్టి కంపెనీ వారేం చెబుతున్నారో!—

"మీరు నిలువ చేయ గలిగిన స్త్రీధనము మీ తండ్రి సోదరుడు భర్త పుత్రుడు వీరిలో నెవరి వద్ద మీరుంచినను సరే దానిని మీ కొరకే వినియోగింపుడు" అని. నా సొమ్ము నా కిచ్చి వేయండి.

పున్న:—నీ తండ్రికి సోదరుడు లేడు. నీ భర్తకి పుత్రుడు లేడు. ఆడబ్బేదో ఆకంపెనీ వాళ్ల దగ్గరే పుచ్చుకో. బుద్ధిమంతుడనైన నేను నీ కొకతెల్లని రూపాయి కూడా యివ్వను.

మీనా:—నా సొమ్ము బోలెడు చేతులో వుంచుకొని నాకొకరూపాయి కూడా యివ్వకుండా నన్ను నానా చిక్కులూ పెడుతూ వున్న భర్తతో నేనేలకాపురం చేయవలె? ఇంక ఇక్కడ ఒక్క ఘడియ వుండను.

పున్న:—ఇష్టమైతే వుండ వచ్చును. కష్టమైతే వెళ్ల వచ్చును. ఉన్నప్పుడు గాని వెళ్లినప్పుడు గాని బండీ అద్దెకైనా సరే నన్ను డబ్బడగ కూడదు. అంతే వెళ్లిన వారు తిరిగి వస్తే చేర్చుకోబడరు.

మీనా:—గడప దాటి వెళ్లిం తరువాత మళ్లీ రావడ మేమిటి లెండి. కోర్టువారే వున్నారు—వెళ్లనా?

పున్న:—శుభం! వైఫ్ గో ఎవే; డోంట్ కమాన్.

మీనా:—మరి నా వస్తువులన్నీ యిటు పడ వేయండి.

పున్న:—ఒక పూతికపుల్ల ఇవ్వను. ఏలాగూ కోర్టె క్కుతూనే వున్నావు. ఇవి కూడా అక్కడే బుచ్చుకో.

మీనా:—మంచిది. నా కా మాత్రం ఆసరా లేదను కోకండి. 'నా' అనే వాళ్లు నాకూ వున్నారు.

పున్న:—ఉన్నాడు పరమాత్మ ల్లాగ వొఖడు! నీ అభిప్రాయం నాకు తెలుసులే. ఈ వూరే ట్రాన్స్ఫరై వచ్చేడుగా ఓవర్సీరుగా మీ తమ్ముడు గారు. వాడు రమ్మని పిల్చేడు. అక్కడికి పోతావు.

మీనా:—అవును. మా తమ్ముడు దగ్గిరకి నేను వెళ్తే తప్పేం? అక్కడికే వెళ్తాను. అక్కడే వుంటాను.

పున్న:—ఉండు ఉండు. ఈ భోగమెన్నాళ్లులే. వాడిదాక్టింగ్ వుద్యోగం. తరవాత అందరూ కలిసి ఇక్కడికే వస్తురుగాని, ఇంతేసి పెద్దకబుర్లు చెబ్తావు, కాని వా డెందుకు రమ్మన్నాడో ఆ మాత్రం గ్రహించేవా?

మీనా:—ఎందుకు? మనసులోనక్క మీద వుండే అభిమానం చేత.

పున్న:—నక్క మీద అభిమానం చేత గాదు; వాడి పెళ్లాం కడుపుతో వుంది. చేసుకోలేదు. నిన్ను చాకిరీకి రమ్మన్నాడు.

మీనా:—ఆఁ మీతో చెప్పేడు.

పున్న:—లేకుంటే నన్ను కూడా ఎందుకు రమ్మన కూడదూ?

మీనా:—అదాగుర్రు? బాగుంది. మీ రెందుకక్కడికి? అక్కడేనా నా ప్రాణం హాయిగా వుండ కూండా.

పున:—వెళ్లు వెళ్లు. నా ఇష్టం నువ్వు పాటించ నప్పుడు నీ యిష్టం వచ్చినట్లే కానీ.

మీనా:—వెళుతున్నాను. ఇదుగో చాకెత బట్టలిస్తే తీసుకొచ్చి ఇచ్చేసిండి.

పున్న:—చిత్తం. మూట మెడకట్టుకొని తీసు కొస్తాను.

మీనా:—ఆపెట్టె- ట్రంకూ తెల్లవారే సరికి కావాలి.

పున్న:—ముందర కావడి వెతుక్కో వద్దూ?

మీనా:—జట్కాయేనా తెచ్చి పెడతారా తేరా?

పున్న:—ఏమి తమాషాలుగా వుంది! ఇదుగో చూడు ఆ చుట్టుపట్ల ఎవరేనా మంచి పిల్ల వుంటే చూడూ- యానాం పోయి యేదో అయిందని పించు కొంటాను.

మీనా:—మమ్మల్ని కూడా తీసుకుపొండేం! పాపం ఇంకా సరదాగా వుంది ఈ బోలు. మంచిది. తలుపేసు కోండి జాగ్రత. (వెళ్ల బోతుంది)

(ప్రవేశం: సూక్ష్మకవి లక్ష్మింపతి)

లక్ష్మిం:—(పుస్తకం చూస్తూ)

'శ్రీరంజిల్లగ భక్తితోడుతను ధాత్రీభాగమందర్మిలిన్, గారాబంబున కేలు మోడ్చి తమితో కాంక్షించి సేవిం చెదన్। శ్రీరామున్ రఘురాము—'

పున్న:—(దిగ్గున లేచి) లక్ష్మింపతీ! ఇదేమిటిది?

లక్ష్మిం:—మరిచిపోయినావా యేమిటి? నేను రచించిన మరున్నందనచరిత్ర ఇక్కడ చదువుదామనుకోలే దయ్యా యీ రాత్రి? అదే ప్రారంభించాను.

మీనా:—నేను వెళ్లిపోతున్నాను. మీరు చదువు కోండి.

లక్ష్మిం:—ఎక్కడికి - ఎక్కడికి - ఎక్కడికెళ్లిపోతున్నావు మీనాక్షమ్మా ?

పున్న:—ఓ స్త్రీ ! కూర్చో ! ఒంటిబ్రాహ్మణు డెదురుగా వచ్చాడు. మీరు మిక్కిలి ఎక్కడికి ఎక్కడికి ఎక్కడికెళిపోతావని అడుగుతున్నాడు. రోజులు బాగు లేవు. ఇవాళకి ప్రయాణమాపు.

మీనా:—గాలివాన పెట్ట నివ్వండి. భూకంపం పెట్ట నివ్వండి గాని నేను వెళ్లక మానను.

పున్న:—తప్పకండా వెళ్లు.

లక్ష్మిం:—ఏమిటి ?— ఏమిటీఘోరం ?— ఏమిటీ ప్రమాదం ?— ఏమిటీవిపరీతం ?— ఏమిటీవైపరీత్యం ?

పున్న:—అది కాపురం వొదులుకుని వెళ్లి పోతున్నాది. దానికి మైనార్టీ తీరింది. పోనీ మనకేం ?

మీనా:—ఈయన అన్నివిధాలా నన్ను చిరాకు పెట్టి నేను పోతే చాల్నని కోరుతున్నారు. కనుక నేను వెళ్తున్నాను.

లక్ష్మిం:—మీరు వకర్నొకరు వదులుకొన్నా నేను మిమ్మల్నిద్దర్నీ వదిలే వాణ్ణి కానే. ఇది జీడి మచ్చ కాదు చెరుపు కొందుకు, ఆనందముద్ర ణాలయ మచ్చు, ముత్యాల్లాంటి అక్షరాలు ఫెదర్ వైట్ పేపర్, కేలికో బైండ్ తెలిసిందా ?

పున్న:—నా కక్కర్లేదయ్యా !

లక్ష్మిం:—శబ్దరత్నాకరం లాంటి భార్యను అక్కర్లేదంటావేమిటయ్యా ? అక్కర్లేక పోయినా లోకం కోసమైనా వుంచుకోవలె.

మీనా:—అసలు నా కక్కర లేదు.

లక్ష్మిం:—అప్పటి కలాగుంటుంది గాని నీ కక్కర్లేక పోవటముండదు. నేను చెప్పినట్లు వింటే అంతా క్షణంలో సైటయి పోతుంది. మీరిద్దరూ రామలక్ష్మణుల్లాగు యీకుర్చీల మీద కూర్చోండి. నేను హనుమంతుల్లాగు యీ ప్రక్క గోడకుర్చీ అయినా కూర్చుంటాను. మరి కూర్చోండి. (ఇద్దరూ కూర్చున్న వెనుక) కూర్చున్నారా ? ఆఁ.

'శ్రీ రంజిల్లగ భక్తితోడుతను ధాత్రీ—'

(పున్నయ్యా మీనాక్షీ ఒక్కసారి దిగ్గున లేచి)

ఇద్దరూ:—ఇదేమిటయ్యా ఇదీ ?

లక్ష్మిం:—మరీ రాత్రీ మరున్నందనచరిత్ర చదువుదామనుకున్నాం కదూ ?

మీనా:—మామనసులు తిన్నగా లేక మేం చస్తూ వుంటే మధ్యను కవిత్వాలేమిటీ ?

పున్న:—ఈ వ్యవహారమేదో తెగిపోనీ. తరవాత మనకి కావలసినంత టైమ్. మీరు రాసిన ఒక్కొక్క పద్యం నేను పదేసి మార్లు వింటాను.

లక్ష్మిం:—భోం చేశారా ?

పున్న:—ఆఁ

లక్ష్మిం:—ఈవిడే వండి పెట్టిందా ?

మీనా:—నేను కాకుంటే ఇంకెవరు వండిపెడ్తారు ?

పున్న:—లోకంలో అందరికీ నువ్వే వండి పెడుతున్నావు !

మీనా:—ఏమాటకీ అర్థం బర్థం వుండదేమిటి చెప్మా.

లక్ష్మిం:—ఉంది ఉంది. చాలా అర్థం ఉంది.

మీనా:—ఏమిటుంది ?

లక్ష్మిం:—నువ్వన్నమాటలోనూ చాలా అర్థం ఉంది. మీ ఇద్దరి మాటలూ మహాగంభీరంగా వున్నాయి. అరగంటాయ తన్నుకొని చస్తున్నాను. అడుగంద లేదు. ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తున్నాను.

పున్న:—అంత ఆలోచించడానికీ అడుగందక పోడానికీ ఏమున్నదయ్యా ? ఇదీ నాతో కాట్లాడేసింది. వాళ్ల తమ్ముడి దగ్గిరకి పోతానంటున్నాది. పొమ్మన్నాను.

లక్ష్మిం:—(దీనంగా) మరి నా పద్యాలు ? మీరు వింటారని గంపెడాశతో వచ్చాను. ఎక్కువొద్దు. 10 పద్యాలు వినండి. మంచి రసపట్టులో చదువుతాను. (పుస్తకం నడుమ తీసి)

'అంతట రామచంద్రుడు వనాంతరమందు చరించుచుండి నిశ్చింతను భార్యనున్నలచి సీతరో యెక్కడికేగి నావు—'

పున్న:—ఆవూ లేదూ పెయ్యా లేదూ. ఆవిణ్ణి మొదట పంపించేసి, తరవాత చదువుకుందాం.

మీనా:—ఒకరు పమ్మించేసే దేమిటి నేనే వెళ్తున్నా.

లక్ష్మిం:—ఆఁ ఉండుండు. చెప్పే వాళ్లకి చాదస్తమయితే వినేవాళ్లకి వివేకమొద్దూ ? ఇద్దరిదీ వొకటే మాటా ? తాపీ తరణం వుండాలి. ముందూ వెనకా

మాచుకోవాలి. తుమ్మితే తూమెత్తేయడమే? దేనికేనా పట్టూ విడుపూ అన్నారు పెద్దలు. అన్నంత పనీ చేసే యడమే?

పున్న:—అంతే. నాతో ఒకమాటంటే అది జరిగి తీర వలసిందే.

లక్ష్మిం:—బ్రాహ్మణ ముండా కొడుకులం గాని మన మేం సత్యహరిశ్చంద్రులమటయ్యా?

పున్న:—సూక్ష్మకవీ! నీకు తెలిదూ? పట్టుదల లోనూ తలతిక్కలోనూ నే నతగాడి తలదన్నిన వాణ్ణి.

మీనా:—అదీ గాక ఒకానొకప్పుడీయన హరిశ్చంద్ర వేషం గట్టారు కూడ.

లక్ష్మిం:—నిజం– నిజం? నేనూ్చడలేదు! ఏదీ యేదీ వొక్కపద్యం చెవులు గింగురుమనేటట్టు!

పున్న:—(కుర్చీ యెక్కి పోయి)

"మాయామేయజగంబె సత్యమని సంభావించి...

...యీయిల్లాలును– యీభార్య– యీకాంతారత్నము–

యీముద్దుగుమ్మ– యీయిల్లాలును రాదు పుత్రుడును

తోడైరాడు రక్షింపగన్, మాయామేయజగంబె సత్యమనీ."

మీనా:—నగలుపెట్టలేని మొగుడు వెంట యేపెళ్లాం వొస్తుంది? అమాయకపు ఇల్లాలు ఆ చంద్రమతీదేవి వెళ్లిందిగాని. పాట మాటకేం ఆ వేషం చూశారు గారు– గొంగళీపురుగుకు ముస్తాబు చేయించినట్లు. సాక్షాత్తూ గుహుడు వేషం లాగుంది.

లక్ష్మిం:—వేష మెలాగుంటేనేం పాట అదీ ముఖ్యం. ఈ పద్యం హీజ్ మాస్టర్స్ వాయిస్‌కివ్వ గూడదూ?

పున్న:—ఈ వ్యవహారమేదో తెమిలిపోతే ఇంక గ్రామఫోన్‌కేనా పోతాను, సినీమాకేనా పోతాను.

మీనా:—సినీమాకే? ఏమిటి పేపర్ల బండీతోనా?

పున్న:—వెళ్లిన వాళ్లందరూ నా కన్న ఎక్కువాళ్లా యేమిటి? ఇంతకీ తెలుగుదేశం ఇప్పుడెంత తెలివి మీరిందో తెలుసునా? తెనుగువాడు 3 కోట్ల జనసంఖ్యలో ఒఖడు ఒఖడు గ్రామఫోన్‌కీ సినీమాకీ పనికిరాని వాడు లేడు.

లక్ష్మిం:—ఆహాహా భగవద్గీతలో సాక్షాత్తూ శ్రీ కృష్ణ భగవాన్లు చెప్పినట్టు చెప్పేవయ్యా. మనిషంటే యేమిటి పరమాత్మస్వరూపం.

మీనా:—ఈయన కృష్ణుడయితే నేను సత్యభామని.

లక్ష్మిం:—అదీ అదీ. అదే నేను కోరేది! మీరిద్దరూ కృష్ణా సత్యభామల్లాగ కలిసి మెలిసి వుండవలె—

పున్న:—పెద్ద కవీశ్వరుడి వేమో సూక్ష్మకవి నని పేరు పెట్టుకున్నావు. నీ తెలివేడిసినట్లే వుంది. నేను కృష్ణుణ్ణయితే తాను సత్యభామట, అంటే నాటెంకె మాడేటట్లు కాల్తో తంతుందట. అదీ దాని భావం.

లక్ష్మిం:—అదా దానిభావం? నేను భావకవిని గాను చూడు పున్నయ్యా! అంచేత నాకు తెలీలేదు. పోనీ యేదో తన్నుకుంటూనో పొడుచుకుంటూనో మీరు కలిసి ఉండడం, అదీ నాకు కావల్సింది.

పున్న:—అది నా జాతకంలో లేదు. వ్యవహారం కానీ.

మీనా:—ఏమిటిది? వ్యవహార జ్ఞానమంతా ఒక్కమారు పుట్టుకొచ్చింది.

లక్ష్మిం:—పుట్టేటప్పుడ లాగే పుడుతుందిలే మీనాక్షమ్మా! మొదట నా కవిత్వం అలాగే పుట్టింది ఒక్కరాత్రిలో. అంతా నన్ను చిక్కులో పడేశారు గాని ఒక్కపద్యం విన్నారు కారు గదా? దుష్కరప్రాస యీ పద్యం వినండీ!

లక్ష్మణ ఆలోచింపక

సూక్ష్మంబుగ సీతగాంచు చొప్పును జెపుమా!'

పున్న:—దీన్నిబట్టేనేమిటండీ మీకు సూక్ష్మకవని కైటిలొచ్చింది? తరవాత చదువుదాం గాని ముందు వ్యవహారం—

లక్ష్మిం:—తరవాత రెండు ప్రాసలూ ఎలాగు వేశానో అన్నసందేహం కలుగుతుంది మీకు. లక్ష్మీనాధుని 'కృపచే' అన్నాను 'ఈక్ష్మాస్థలి' అన్నాను.

మీనా:—మా బాగా అన్నారు. ముందర నా సొమ్ము నాకిప్పించి వేయండి.

పున్న:—సొమ్ము! హిజ్ గ్రాండ్ ఫాదర్స్ రుపీస్! నా బంగారం అక్కడ పెట్టి కాలు కదపమను.

మీనా:—ఇది యీయన పెట్టిన బంగారం కాదు. వీరి తండ్రిగారు పెట్టినది.

లక్ష్మిం:—ఆయన స్వర్గస్థులైనారే. అదుగో అదుగో ఆయన నాకు స్వర్గవీధిలో కనబడుతున్నారు. ఆయన సంపూర్ణవిగ్రహాన్ని నేను చూస్తున్నాను. ఆయన్ని తెప్పించడానికి మార్గం వుంది.

పున్న:—ఎలాగు మహాప్రభో? నువ్వోఘటికుళ్లా గున్నావే!

మీనా:—ఏవరిచేతనయినా వేషం వేయించి తెప్పిస్తారు కాబోలు.

పున్న:—అదికాదు ముక్కాలిపీట ద్వారా మాటాడిస్తాడేమో.

లక్ష్మిం:—ఇదీ కాదు అదీ కాదు. మీరు భారతం చదవ లేదూ? 'నన్నయ తిక్కనాదికవినాథులు చేసిన భారతంబు' నేను చెప్పేనీపద్యం. ఏదీ మీరు వింటేనా? సరే, ఈ 12 ఏళ్ల వనవాసం తరవాత ఒక్క ఏడజ్ఞాతవాసం అనుకోండి. ఏదో రెండో కంటివాళ్లకు తెలీకండా కాలక్షేపం చేసి ఒక మగపిల్లకాయను గని భూమ్మీద పడేస్తువా—వాడికి నీ తండ్రిపేరే పెడతావు గనక వాడు నీ తండ్రే గనుక వాడిచేతనే అడిగించ వచ్చును.

మీనా:—ఆలాగు అడిగించినా నేను మైనర్ని అయినప్పుడు నా వొంటిమీద పెట్టిన సొమ్ము ఒక మైనరు వచ్చి అడిగితే ఇవ్వడమేలాగు?

లక్ష్మిం:—మరొక్క 18 సం॥ వూరుకుంటే వాడికి మైనార్టీ తీరి పోతుంది.

పున్న:—అప్పటికి గడచినవో 18 ఏళ్లు ఇవో 18 ఏళ్లూ కలిసి 36- 3 కాలదోషాలవుతుంది.

మీనా:—ఇప్పటికే 18 ఏళ్లయింది గనుక కాలగోషం కాలదోషన్నరకూడా అయిందని గుప్చుప్‌గా వూరుకోండి.

పున్న:—గుప్చుప్‌గా వూరుకోవాలా? ఏం మాటలు మిగల చెబుతున్నావు!

మీనా:—లేకుంటే గమ్మని నోరు మూసుకోండి.

పున్న:—అలాగనూ వొప్పుకుంటాం. ఏమయ్యా పోనీ అప్పుడు మాతండ్రిగారు పెట్టిన బంగారం మాట అలా వుండనీ నేను చేతులారా తెచ్చి ఇచ్చిన పౌడరుడబ్బాలన్నా ఇమ్మను.

మీనా:—ఆడబ్బాలన్నీ ఇంట్లోనే వున్నాయి, ఏరుకుంటే సరి. ఇంతకీ వారికి డబ్బాలెందుకు ఆయనే స్వయంగా వొకడబ్బా. శ్రీకృష్ణుడికి అర్జునుళ్లా తమరొకరున్నారాయె. ఇంకా యెందుకీడబ్బాలవస్థ? ఓహో సినీమా ఎడ్వర్టైజు మెంటుకా?

పున్న:—రేప్రొద్దున్నా, సినీమాహాల్లో, ఏటాకీలోనో గప్పున నేను కనబడ్డానంటే ఇది బుర్రకాయ వొంచుకో వద్దూ!

మీనా:—నేనే అన్నమాటేమిటి దేశమంతా వొంచుకోవాలి.

పున్న:—దీంతో మాట్లేమిటి? నీతో వేరే చెబ్తాను. సరే - వెళ్లమనిప్పటికి. అన్నివ్యవహారాలు కోర్టులోనే ఫైసలవుతాయి.

మీనా:—మరి జట్కా తెప్పించండి.

పున్న:—నేను వెళ్లలేను. దానికి జట్కా కావాలిట తీసుకు రావయ్యా?

లక్ష్మిం:—అయితే మరి కలవరూ?

మీనా:—ఈ జన్మలో లేదు.

లక్ష్మిం:—పోనీ కలిసి వొకపాటో తీయించుకునే దాకానయినా?

పున్న:—లేదు.

లక్ష్మిం:—పోనీ మనసులు చల్లబడి కోపాలు తీరి అభిమానాలు పోచ్చేవరకేనా?

మీనా:—లేదు.

లక్ష్మిం:—పోనీ నా మనసులో కోర్కె - ఒకకొడుకు పుట్టేవరకయినా?

ఇద్దరూ:—(గట్టిగా) లేదయ్యా లేదు.

లక్ష్మిం:—(కాళ్లు జూచుకొని గట్టిగా వెక్కివెక్కి యేడుస్తాడు)

మీనా:—ఇదేమిటయ్యా! నిండింటో బావురు మని ఏడుస్తున్నావు. ఆయనకు మొన్ననే పుట్టెడు జబ్బుచేసి నింపాదిగా వుంది. వూరుకో వూరుకో!

పున్న:—లక్ష్మింపతీ! ఊరుకోవూ? ఏమిటీ మమకారం? ఈ మాయలోకంలో యీ కలికాలంలో భార్యయెవరు పుత్రుడెవరు? ఎవరికి వారే యమునాతీరే - ఊరుకో! ఊరుకో!

లక్ష్మిం:—(ఇంకా గట్టిగా యేడుస్తాడు)

పున్న:—ఛప్ నూర్మయ్! ఎవరేనా వింటే నిన్ని ఇంట్లోపెట్టి ఇద్దరంకలిసి కుళ్ల పొడుస్తున్నామనుకుంటారు.

లక్ష్మిం:—(చప్పున యేడుపు ఆపి) కవిహృదయ మెంత మృదువో మీకేం తెలుసు? అందులో నేను కావ్యం

రాసిన 'కవిని 'నిండుమనంబు నవ్యనవనీతసమానము' వట్టి మెత్తని మనస్సు. మీరెంతలేసి మాటలనుకున్నారు! అవి (చెవి చూపి) ఇక్కడ తగిలినవి (గుండె చూపి) ఇక్కడ తగిలినవి (తల చూపి) ఇక్కడ తగిలినవి (ఒక్క ఎగురెగిరి) ఒళ్లంతా నఖశిఖపర్యంతం తగిలినవి. క్షమించండి. ఇంత దుఃఖం నేను భరించ లేను. మీరు వచించినమాటలు అవచించండి.

పున్న:—విడిపోతే ఆదుఃఖం నువ్వు భరించలేవు - కలిసుంటే నేను భరించ లేను-ఏం దారి?

లక్షిం:—(కాళ్లు టపటప కొడుతూ) అబ్బా! అబ్బా! విషాదము! విషాదాంతము! విషదాంతనాటకము?

మీనా:—ఎప్పుడూ? ఎక్కడ? ఎవరాడుతున్నారు? విషాద సారంగధరా?

లక్షిం:—(ఒకదుముకు దుమికి) మర్నేను బ్రతకను. బ్రతక లేను- మీ నూతులో పడి చస్తాను.

ఇద్దరూ:—ఆఁఆఁ. మా పీకలమీదికి తెస్తావా 'యేమిటి? ఉండుండు నువ్వు చెప్పినట్లు వింటాం. కూర్చో. పస్తాయించు.

లక్షిం:—న్యాయంగా ధర్మంగా తీర్పుచెబ్తాను. నేనుచెప్పినట్లు మీరిద్దరూ వినండి. భగవంతుడిమీద భారంవేదాం. (తనజేబులో నుంచి రూపాయి తీసి) ఇది రూపాయి! పైకెగమీటుతాను. ఇద్దర్లో యెవరు గెలిస్తే వారిమాట చెల్లవలె. అమ్మా నీకు బొమ్మ కావాలా: అక్షరాలా? ఏదో వొకటే - రెండూ పనికి రాదు. ఆలోచించి చెప్పు.

మీనా:—నాకు బొమ్మే కావాలి.

లక్షిం:—నీకయ్యా?

పున్న:—వేరే అడిగే దేమిటి? ఆవిడ ఉచ్చిష్టం అంతా అనుభవించడానికి నేను న్నానుగా. ఆదిక్కు మాలిన అక్షరాలే నాకు కానివ్వండి.

లక్షిం:—ఇద్దరూ వొప్పుకున్నట్టే గదా! చూసుకోండి. అన్యాయం లేదు. (కళ్లు మూసుకొని 'తల్లీనిన్ను దలంచి పుస్తకము చేతన్బూనితిన్' అన్న పద్యం చదివి రూపాయి పైకి మీటుతాడు.)

ఇద్దరూ:—(ఒక్కమాటుగా) నేను గెల్చేను. నేను గెల్చేను.

లక్షిం:—అర్రర్రే. రూపాయి పెట్టె కిందకుపోయింది.

మీనా:—ఆ పెట్టె నాదీ. అంచేత నేనే గెల్చినట్టు.

పున్న:—ఆ పెట్టె నేనుకొని దానికిచ్చాను. అంచేత నేనే గెల్చినట్టు.

లక్షిం:—అంటే—భగవంతుడు కూడా 'యీవివాద నేను తీర్చలే' నని ఒక దండం పెట్టేసే దన్నమాట. కానీ - భగవంతుడు చెయ్యలేని పని మనం చేస్తేనే ప్రయోజకత్వం. దంపతులారా! చూడండి నా తెలివితేటలు! ఆ రూపాయి తిప్పకుండా అలాగే తీస్తాను. కావలిస్తే నాచెయ్యి పట్టుకోండి (చేయిపెట్టె కిందపెట్టి, తీసి) చచ్చిపోయినానోయ్! అమ్మో అమ్మో!

ఇద్దరూ:—ఏమేమి! ఏమిజరిగింది?

లక్షిం:—తేలు కాబోలోయ్ బాబూ! చచ్చిపోయేను. చచ్చిపోయేను.



ఇద్దరూ:—ఏది యేదీ చెయ్యి ?

లక్షిం:—వద్దోయ్ ! వద్దోయ్ ! మరి బ్రతకను. జాతక రీత్యా నాకీవేళ మారకం వుంది. వచ్చేసింది.

పున్న:—తేలు పొడిస్తే మారకం ఏమిటయ్యా ? ఓర్చుకో ! మంత్రం వేయిస్తాను. మందిప్పిస్తాను.

లక్షిం:—అదీ పని చెయ్యదు మహాప్రభో ! (ఏడుస్తూనే) బలం లేని వెధవ తెలుగు భాషలో ఏ పులికంటే సింహం కంటే ఎక్కువ విషం గలిగిన యీ క్రూరజంతువును తేలు తేలు' అని రెండక్షరాలలో అనేసేరు. కాని బంగారంవంటి దేవ భాష అయిన సంస్కృత భాషలో (గట్టిగా) దీన్ని వృశ్చిక మన్నారర్రో ! దీనితో లగ్నం కూడా కల్పించేరర్రో ! అబ్బా ! అబ్బా ! హా పరమేశ్వరా ! పరంజ్యోతీ ! (కలడందురు దీనులయెడ అన్న పద్యం చదువుతాడు.)

పున్న:—ఏమయ్యా ! ఈ పద్యంతో ఏమేనా కొంత బాధ తగ్గిందా ?

లక్షిం:—లేదు. లేదు. నాకు చావు నిశ్చయం. 'నువ్వున్న చోట అధర్మం జరిగిందంటే నువ్వు చార్మని చస్తావన్న మాట' అని చెప్పేడు బైరాగొకడు ఆ మృత్యువే యీ తేలు రూపేణ వచ్చింది.

ఇద్దరూ:—అలాగా ? అయితే మేం విడిపోం. కలిసే వుంటాం.

లక్షిం:—నిజంగా ? నిజంగా ?

ఇద్దరూ:—ప్రమాణ పూర్తిగా !

లక్షిం:—ఇప్పుడు బాధ కొంత తగ్గుతున్నాది-తగ్గింది.

పున్న:—తేలు పోటు కిదోమందా ? పేపర్లో ఎడ్వర్టైజుమెంటు వెయ్యకూడదూ ?

మీనా:—ఇంత సుళువుగా తేలి పోతుందేం తేలు పోటు ?

లక్షిం:—అమ్మో ! అమ్మో ! మళ్లీబాధ ఎక్కువయి పోతున్నాది. మీకు నమ్మకం పోయింది కాబోలు. నేను మరి బ్రతకనోయ్ (ఏడుపు)

పున్న:—మీనం ఏందారి మనం కలియకపోతే ఇత డిలాగు తెల్లవార్లూ అల్లరి పెట్టేసేటట్లుంది.

మీనా:—ఈలాటి స్థితిలో ఓదార్చకుండా ఇతణ్ణి పంపించి వేస్తే బాగుంటుందా మరి ?

లక్షిం:—(గట్టిగా కేకపెట్టి) నాకు యమబాధగా వుందర్రో ! ఓహో ! ఎవరానీడ ? పరేతపతియా ? (రామ తిలకం గొంతుకుతో) ఓ యమధర్మరాజా !

పున్న:—పొమ్మన వయ్యా ! ఆయముణ్ణి, మేం కలిసి వుంటాం

మీనా:—మనసారా చెబ్తున్నాం - కలిసి వుంటామయ్యా. ప్రాణం కాపాడు కోండి.

లక్షిం:—ఇప్పుడు కొంతతగ్గింది బాధ. కాని దయచేసి ప్రమాణం చెయ్యండి. నాకూ ఆ యముడికీ కూడా నమ్మకం కలిగేటట్టు.

పున్న:—చేస్తాం—జంఝ్యం పట్టుకొని ప్రమాణం చెయ్యనా ?

మీనా:—మంగళసూత్రం పట్టుకుని ప్రమాణం చెయ్యనా ?

లక్షిం:—అలాకాదు. ఆమె మంగళసూత్రం నువ్వు నీ జంఝ్యం ఆవిడ - ఊఁ - పట్టుకోండి - ఇంక నే చెప్పినట్లనండి. 1935 సం- ఆగస్టునెల 1-వ తేదీని రాత్రి 12 గంటలకు చిత్తానక్షత్రం వృశ్చిక లగ్నమందు, మొదట దంపతులమై, తర్వాత వివాహ బంధమోక్షము కోరి మరల యమభయము వలన ఒకటిగా కలిసిన—గట్టిగా అనండి - మీనాక్షీ పున్నయ్యా అనే మేము ఎన్నడూ వివాదపడుట గాని తిట్టుకొనుట గాని - కొట్టుకొనుట గాని - గిల్లుకొనుట గాని - కరచుకొనుట గాని - అప్పుడప్పుడు తప్ప - బాగా అనండి గట్టిగా - ఉభయ సమ్మతినీ అప్పుడప్పుడు తప్ప చేయము. దీనికి స్త్రీపురుష పవిత్ర వివాహబంధ సంరక్ష కలియుగ సనాతన ధర్మప్రతిష్ఠాపనాచార్య శ్రీ శ్రీ శ్రీ సూక్ష్మకవి లక్షింపతిసాక్షి- అబ్బా ఎన్నిప్రాసలో ! బాస్ బాగుంది. (వారు పైమాట లంటారు)

పున్న:—ఇప్పుడు నొప్పి పోయిందా ?

లక్షిం:—ఓ ! సమూలంగా. ఆ వేలు మునపటికంటే చాలా సుఖంగానూ కులాసాగానూ ఆనందంగానూ వుంది.

మీనా:—పోనీ మరేం నీడలు కనబడలేదు గద ?

లక్షిం:—నవ్వకండి. నవ్వకండి. యమదూతలు నీడ రూపంలోనే కనబడతారు.

పున్న:—ఆ యోగి మాటలు తప్పిపోయి నట్లేనా?

లక్ష్మిం:—ఆ - మీదయవల్ల నాకు గండం గడిచి పోయింది. ఇప్పుడు మీకు పునస్సంధానం చేయగ్లేను

పున్న:—పునస్సంధానం చెయ్యడ మేమిటయ్యా!

లక్ష్మిం:—అవును. విడి విడిగా పోడి పోడిగా మడి మడిగా వున్న భార్యా భర్తలను కలిపి వొకటిగా చేయడం పునస్సంధానం కాదూ? ఏమమ్మా ఇపుడు తెలిసిందా పునస్సంధానమంటే?

మీనా:—ఆ - పన్నెండేళ్ల కిందటనే తెలిసింది. ఇంక వెళ్తారా?

లక్ష్మిం:—వ్యవహార మంతా తెగిపోయింది గనుక కదళీపాకంలో వున్నాయి 4 పద్యాలు హాయిగా చదువుకుందామా?

'వచ్చెను రావణుండు పరివారము తోడుత సీతజూడ'_

పున్న:—ఆపు ఆపు. రాత్రి చాలా పొద్దు పోయింది. ఈ మారు చదువుకుందాం_. ఇప్పటికి వెళ్లు లక్ష్మింపతీ!

లక్ష్మిం:—సరే. మరి పుణ్యదంపతులు, పురాణదంపతులు, నన్నాశీర్వదించండి (నమస్కరిస్తాడు)

పున్న:—అముద్రిత గ్రంథములలో మీ గ్రంథము చేరుగాక.

మీనా:—సంవత్సరాది సంచికలో మీ ఫోటోపడుగాక.

లక్ష్మిం:—ధన్యుడను. నమస్కారం. సెలవు. (వెళ్లి తిరిగివచ్చి) మరి మీరు దెబ్బలాడరని నాకేం గురుతు?

పున్న:—మళ్లీ వచ్చావటయ్యా!

మీనా:—గురుతేమిటి మేం కలిసి వుండడమే గురుతు.

లక్ష్మిం:—అయినా రోజూ వుదయం సాయంకాలం వచ్చి డాక్టర్ రోగిని చూసినట్లు చూసి పోతూవుంటాను.

పున్న:—చచ్చేం. వద్దు. వద్దు. ప్రతిరోజూ వుత్తరం వ్రాస్తూ వుండండి.

మీనా:—ఇద్దరం జవాబు రాస్తూ వుంటాం ఇంక వెళ్లండి.

లక్ష్మిం:—అయితే వెళ్లనా!—

మీనా:—తమ కిక్కడనుంచి వెళ్లాలని వుంటే. లేకుంటే క్యాంపుకాటు వేస్తా యిక్కడే పండుకోండి.

లక్ష్మిం:—వెళుతున్నా (వెనక చూస్తూ వెళ్తాడు)

పున్న:—మళ్లీ వస్తాడేమో తలుపు వేసేదాం. పిల్చినా పలకవద్దు (తలుపు వేసేస్తారు)

లక్ష్మిం:—(నేపథ్యం నుంచి) అన్నా అప్పుడే తలుపేశేశారు! రూపాయుండి పోయింది.

ఇద్దరూ:—(బిగ్గరగా నవ్వుతారు)

గట్టివి, చాలాకాలము మన్నేవీ,
క్యాంపు మంచములు ౫—౧౨—౦
కేశవరాం అండ్ కంపెని
I/287. ఎస్ప్లనేడ్ రోడ్డు, మదరాసు



*MADRAS AGENTS —*
DAMODER & CO.,
China Bazaar MADRAS